
## చైన్ స్నాచింగ్ నివారణకు ఫుట్ పెట్రోలింగ్



**శామీర్‌పేట, జనవరి 20, ప్రభాతవార్త :** చైన్ స్నాచింగ్ ఘటనల నివారణకు తూంకుంటలో శామీర్‌పేట పోలీస్ ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్ ఆధ్వర్యంలో పోలీసులు ఫుట్ పెట్రోలింగ్ మంగళవారం నిర్వహించారు. శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలో ఇటీవల జరిగిన చైన్ స్నాచింగ్ ఘటనల నివారణకు తూంకుంటలోని కాలనీల్లో శామీర్‌పేట సిఐ శ్రీనాథ్, డిఐ రాజు, ఎస్ఐ శశివర్ధన్‌రెడ్డి, ఇతర పోలీసు సిబ్బంది కలిసి ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామ మహిళలకు భద్రత జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనుమానస్పద వ్యక్తులు కనిపించినా అప్రమత్తంగా ఉండాలని, వెంటనే పోలీసులుకు సమాచారం ఇవ్వాలన్నారు. రాత్రి వేళల్లో ఒంటరిగా ప్రయాణించే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని, ఏవైనా అనుమానస్పద కార్యకలాపాలు గమనించినా వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని శామీర్‌పేట సిఐ శ్రీనాథ్ కోరారు. కాలనీల్లో, బస్తీల్లో ఉన్న వారికి చైన్‌స్నాచర్స్ పట్ల తీసుకునే జాగ్రత్తలను వారు వివరించారు. పోలీసులు గస్తీ నిర్వహించి ఫుట్ ఫెట్రోలింగ్ నిర్వహించారు.

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

# వార్త


## ఆల్‌రౌండర్లు ఔట్..?




**ఎ టూ జడ్ విధుల్లో గ్రామ పంచాయతీ కారోబార్లు**

**30 ఏళ్లుగా కీలక సేవలు**

**నాడు మల్టీపర్పస్ వర్కర్లు.. నేడు కోఆర్డినేటర్‌లుగా నామకరణం**

**తాజా ఎన్నికల్లో పలుచోట్ల రాజకీయంగా పనిచేశారన్న ఆరోపణలు**

**ప్రత్యర్థులకు కొమ్ము కాసిన వారిని కొనసాగించటానికి ఇష్టపడని కొత్త సర్పంచ్‌లు**

**ఉంచితే పాలనా వ్యవహారాల్లో చెడ్డ పేరు తెచ్చే అవకాశముందన్న గుబులు**

**ఊడగొడితే యూనియన్ నేతల ఉద్యమాలను ఎదుర్కోవాల్సివస్తుందని మీమాంస**

**యాచారం, జనవరి 19, ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ కార్యాలయాలలో కారోబార్ల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. కొత్త పాలకవర్గాలు ఏర్పడిన నేపథ్యంలో ఇప్పటి వరకూ కీలక బాధ్యతలు నిర్వహించిన వీరిని కొనసాగింపు వ్యవహారం స్థానికంగా చర్చనీయాం సమవుతోంది. దాదాపు అన్ని గ్రామాలలోనూ గతంలో పనిచేసిన కారోబార్లు ఏదో ఒక పార్టీకి, అభ్యర్థికి పంచాయతీ ఎన్నికలలో అనుకూలంగా పనిచేశారు. ప్రత్యర్థులకు మద్దతుగా ఉన్న వీరి వ్యవహార శైలి కొత్త సర్పంచ్‌లకు మింగుడు పడటంలేదు. పాత కారోబార్లనే కొనసాగిస్తే తమకు పాలనా పరమైన ఇబ్బందులు ఎదురవుతాయన్న సందిగ్ధంలో ఉన్నట్లు తెలుస్తోంది.

కారోబార్ అంటే గ్రామ పంచాయతీకి ఆల్ రౌండర్. ఇంటి పన్ను లు, రికార్డుల నిర్వహణ, సమాచారం, జనన మరణాల నమోదు, పథకాల అమలు, లబ్ధిదారుల గుర్తింపు, తాగు నీరు, పారిశుధ్యం, డ్రైవింగ్, మెకానిక్, వీధి దీపాలు ఇలా ఒకటేమిటీ పంచాయతీ పరిధిలో దాదాపు 30కిపైగా విధులు నిర్వహిస్తారు. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రతీ గ్రామ పంచాయతీకి వీరు ఆరో ప్రాణం లాంటివారు.

గ్రామ పంచాయతీలో వివిధ పనుల నిర్వహణకు స్థానికులను గతంలో కారోబార్లగా నియమించుకుంది. వీరిని పంచాయతీ తీర్మానం ద్వారా విద్యార్హతలు, నైపుణ్యం ఆధారంగా చేర్చుకునేవారు. ఉదాహరణకు డిగ్రీ ఆపైన చదివిన వారికి బిల్ కలెక్టర్, రికార్డుల నిర్వహణ వంటి పనులు, డ్రైవింగ్, ఎలక్ట్రీషియన్, ప్లంబర్ పని తెలిసిన వారికి అవే ఉద్యోగాలు మిగిలిన వారిని సఫాయి కార్మికులుగా నియమించుకునేవారు. వీరిలో రికార్డుల నిర్వహణ, బిల్లుల వసూళ్ళు, సమాచార సేకరణ వంటి రాత పనులు చూసే వారిని కారోబార్లగా మిగిలిన వారిని సిబ్బందిగా మిగతా 3లో




**'పుర'బరికి ప్రధాన పార్టీల్లో సత్తా ఉన్న అభ్యర్థుల కొరత**

**వార్డులలో గెలుపు గుర్రాల కోసం వేట**

**పోటీకి ఇబ్బడి ముబ్బడిగా దరఖాస్తులు**

**సొంత బలం ఉన్న వారి కోసం వడపోత**

**గెలుపే లక్ష్యంగా బిఆర్ఎస్, బిజెపి రహస్య పొత్తు**

**ఒకరికి బలమున్న చోట ఇంకొకరు డమ్మీ అభ్యర్థులతో ఎంట్రీ**

**ఊపందుకున్న పార్టీ ఫిరాయింపులు**

**(ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి)** పురపాలక సంఘాల ఎన్నికల్లో గెలుపు గుర్రాల కోసం వేట ఊపందుకుంది. రిజర్వేషన్ల దశ పూర్తయినప్పటి నుంచి పట్టణాల్లో రాజకీయ కోలాహలం కనిపిస్తోంది. వికారాబాద్ జిల్లాలో తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీలకు ఎన్నికలు జరుగనున్నాయి.

**హడావుడి అంతా తాండూరులోనే**

ఈ నాలుగింటిలో తాండూరులోనే రాజకీయ పార్టీల హల్‌చల్ ఎక్కువైంది. చైర్మన్, కౌన్సిలర్లుగా పోటీ చేసేందుకు పలుచోట్ల ఆశావహులు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. మరికొన్ని చోట్ల నిరాసక్తత వ్యక్తం చేస్తున్నారు. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్ మధ్యే ఎక్కువచోట్ల పోటీ నెలకొంటోంది.

**వార్డుల్లో ప్రజాభిప్రాయ సేకరణ**

మతపరమైన ఓటు బ్యాంకుపై బిజెపి, ఎంఐఎం ప్రభావం చూపెట్టవచ్చని భావిస్తున్నారు. అభ్యర్థుల ఎంపిక కోసం ఆయా పార్టీల నేతలు వార్డుల వారీ సమావేశాలు నిర్వహిస్తూ వడపోతలో తలమునకలయ్యారు. కార్యకర్తల అభిప్రాయాల సేకరణ ద్వారా ప్రజాబలం ఉన్న వారిని గుర్తించే పనిలో ఉన్నారు.

**ఒక్క ఛాన్స్ ప్లీజ్**

మరోవైపు కొంతమంది ఆశావహులు ఒక్క ఛాన్స్ ప్లీజ్ అంటూ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిని ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ విప్ మహేందర్‌రెడ్డి అనుయాయులలో ఒకరిద్దరికి కాంగ్రెస్ టిక్కెట్లు దక్కే అవకాశాలున్నాయి.

**ఆశావహులపై ధీమా లేక..**

తాజా పరిస్థితులు పరిశీలించినట్లయితే పోటీకి సై అనే వారి సంఖ్య ఎక్కువగా ఉన్నా.. ప్రధాన పార్టీలకు సత్తా ఉన్న అభ్యర్థుల కొరత వేధిస్తోంది. గెలుపు ఖాయమనే ధీమా వ్యక్తం చేసే ఆశావహుల సంఖ్య వేళ్లపైనే లెక్కపెట్టవచ్చని అంటున్నారు. తాండూరులో 36 వార్డులు ఉన్నప్పటికీ ప్రధాన రాజకీయ పార్టీలకు ఇంకా పూర్తిస్థాయి అభ్యర్థులు దొరకడం లేదు. కొంతమంది టికెట్లు ఆశిస్తున్నా వారు గెలుస్తారనే నమ్మకం అధిష్టానాలకు కలుగడం లేదు. ఇప్పటి వరకు కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు రహస్యంగా సర్వేలు జరిపినట్లు సమాచారం.

**లోలోపల గుబులు**

గెలుపుపై రెండు పార్టీలూ ధీమా వ్యక్తం చేస్తున్నా ఎక్కడో కొంత అనుమానాలు కూడా వ్యక్తం చేస్తున్నాయి.

**ఐదారు వార్డుల్లో బిఆర్ఎస్ తిప్పలు**

బిఆర్ఎస్ పార్టీ పలు వార్డులలో బిజెపితో రహస్య ఒప్పందం కుదుర్చుకున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. బిజెపికి బలమైన ఓటుబ్యాంకు ఉన్నచోట్ల బిఆర్ఎస్ తరపున డమ్మీ అభ్యర్థులను బరిలో దించుతుందని ప్రచారం జరుగుతోంది. అలా తాండూరులో ఐదారు వార్డుల్లో బిఆర్ఎస్ మరీ బలహీనంగా ఉందని తెలిసింది. బిఆర్ఎస్‌కు బలమైన కేడర్ ఉన్నచోట్ల బిజెపి పోటీ చేయకపోవచ్చని భావిస్తున్నారు.

**కమలానికి గులాబీ ఆర్థిక భరోసా?**

బిజెపి అభ్యర్థులలో ఒకరిద్దరికి ఆర్థికపరమైన సహాయ సహకారాలు అందజేసేందుకు బిఆర్ఎస్ సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. ఈ విషయంలో ఎంపి కొండా విశ్వేశ్వరరెడ్డి తాండూరు రాజకీయాలపై ఇంకా ఫోకస్ పెట్టలేదు. లోపాయికారి ఒప్పందం గురించి ఆయనకు తెలిస్తే ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందేనని అనుకుంటున్నారు. డమ్మీ అభ్యర్థులపై బిఆర్ఎస్ చైర్మన్ అభ్యర్థి పటేల్ నర్సింహులు మాట్లాడుతూ అన్ని వార్డులలో బలమైన అభ్యర్థులనే బరిలో దించుతామని స్పష్టం చేశారు.

**అధికార పార్టీకీ ఇదే అవస్థ**

ఇక అధికార కాంగ్రెస్ పార్టీకి కూడా పలువార్డులలో బలమైన అభ్యర్థులు దొరకడం లేదని సమాచారం. పలు వార్డులలో ఇద్దరు ముగ్గురు అభ్యర్థులు టిక్కెట్లు ఆశిస్తున్నా సర్వే నివేదిక ప్రకారం.. ఎవరికి అవకాశం వస్తుందన్న విషయంపై ఉత్కంఠ నెలకొంది. దీనిపై మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి స్పందిస్తూ అన్ని వార్డులలో గెలుపు గుర్రాలే ఉన్నాయని స్పష్టం చేశారు.

**సగం వార్డులకే బిజెపి, ఎంఐఎం పరిమితం**

బిజెపి, ఎంఐఎం పలు వార్డులలో తమ ప్రాబల్యం నిరూపించవచ్చని పరిశీలకులు పేర్కొంటున్నారు. కానీ ఆ రెండింటికి సగం వార్డులలో కూడా పోటీ చేసే అవకాశాలు కనిపించడం లేదు. అభ్యర్థుల కొరత, పార్టీ కేడర్ నిర్మాణం సరిగ్గా లేకపోవడం, ఆర్థిక పరమైన కారణాలే ఇందుకు ప్రధాన కారణమని చెబుతున్నారు. మిగతా 3లో

## విపత్తులు ఎదుర్కోవటంలో అవగాహనకు మాక్ డ్రిల్



సన్నాహక సమావేశంలో ఏర్పాట్లను వివరిస్తున్న ఎన్.డి.ఎం సిబ్బంది. ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జనవరి 20, ప్రభాతవార్త :** బహుళ ప్రమాదాల విపత్తులపై మాక్ డ్రిల్ నిర్వహణకు పక్కగా ఏర్పాటు చేయాలని ఎన్.డి.ఎం.ఎ అధికారులు పిలుపునిచ్చారు. ఈ నెల 21న జిల్లాలో ప్రయోగాత్మకంగా నిర్వహించే ఈ కార్యక్రమానికి ముందస్తు ఏర్పాట్లపై మంగళవారం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. బహుళ విపత్తులు సంభవించిన వెంటనే చేపట్టవలసిన తక్షణ చర్యలు సమన్వయం, సమాచార వ్యవస్థ, అత్యవసర సేవల నిర్వాణ వంటి అంశాలపై మార్గ నిర్దేశం చేశారు. బుధవారం నాడు శంషాబాద్‌లోని ఎయిర్పోర్ట్ ఆవరణలో నిర్వహించే ఈ కార్యక్రమంల బహుళ ప్రమాదాల విపత్తులు, వరదలు, ఊహించని రీతిలో ప్రమాదాలు జరిగిన సమయంలో ఎలా స్పందించాలి, ఆస్తి ప్రాణ నష్టం నివారించేందుకు ఏ విధమైన చర్యలు తీసుకోవాలి వివిధ శాఖల మధ్య సమన్వయం ఎలా ఉండాలి అనే అంశాలపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పిస్తామన్నారు. విపత్తులను ఎదుర్కొనే విషయంలో సన్నద్ధత ఏ మేరకు కలిగి ఉన్నామనేది అవగతం అవుతుందని పేర్కొన్నారు. పకడ్బందీగా నిర్వహించేందుకు సంబంధిత అన్ని శాఖలు అధికారులు సంసిద్ధంగా ఉండాలని సూచించారు.

**అధినేతల ప్రసన్నం కోసం ఆమనగల్లు ఆశావహుల ఆరాటం**

**మున్సిపల్ వార్డుల్లో టికెట్ కోసం ప్రదక్షిణలు**

**కాదంటే పక్క చూపులకూ సిద్ధమంటూ బెదిరింపులు**

**ఏకాభిప్రాయ సాధన కోసం తలలు పట్టుకుంటున్న నేతలు**

**అసమ్మతి వాదులకు బుజ్జగింపులు**

**కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యే కసిరెడ్డికి ఎంపిక బాధ్యతలు**

**బిజెపిలో నియోజకవర్గ ఇంఛార్జి తల్లోజు ఆచారి పర్యవేక్షణ**

**బిఆర్ఎస్‌లో ముగ్గురు మొనగాళ్ల మధ్య గందరగోళం**

## వినయ విధేయ రామ!



**ఆమనగల్లు, జనవరి20, ప్రభాతవార్త:** త్వరలో జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీల అధినేతలు అభ్యర్థుల ఎంపికకు కసరత్తులు ముమ్మరం చేశారు. గెలుపు గుర్రాల కోసం ఇప్పటికే ఆయా అధినేతలు ప్రత్యేక సర్వేలు ప్రారంభించి ఎంపికను కొలిక్కి తీసుకువస్తున్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 15వార్డులో అధిక స్థానాలను కైవసం చేసుకుని చైర్మన్ పదవిని వశం చేసుకోవడానికి ప్రణాళికలు రచిస్తున్నారు. అన్ని పార్టీలకు ఒక్కో వార్డులో అభ్యర్థుల ఎంపిక తలనొప్పిగా పరిణమించినట్లు కనిపిస్తుంది. ఆశావాహుల తీవ్ర ఒత్తిడిని ఎదుర్కుంటూ అధినేతలు తుది అభ్యర్థుల జాబితాను ఎంపిక చేపడుతున్నట్లు కనిపిస్తుంది. కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు ఆమనగల్లు, కల్వకుర్తి మున్సిపాలిటీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. నియోజకవర్గంలోనే ప్రధాన పట్టణాలైన కల్వకుర్తి, ఆమనగల్లులో పట్టు సాధించి తమదే పైచేయిగా నిలవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, బిజేపి తరపున నియోజకవర్గ ఇంఛార్జి తల్లోజు ఆచారీలు అభ్యర్థుల ఎంపికను చేపడుతున్నారు. అయితే బిఆర్ఎస్ పార్టీలో మాత్రం ఆశావాహులు కొంత అయోమయానికి గురౌతున్నట్లు సమాచారం. అందుకు కారణం కొందరు పార్టీ ఇంఛార్జీ జైపాల్‌యాదవ్ వద్దకు, మరికొందరు ముఖ్య నేతలు ఉప్పల వెంకటేశ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డిల వద్ద వాలుతున్నారని, దీంతో అభ్యర్థుల ఎంపిక ఆపార్టీలో గందరగోళానికి దారితీస్తోందోనని చెబుతున్నారు. ఎవరు ఎవరికి మద్దతు ఇస్తున్నారో అర్థం కాలేక ఏ అధినేతను ప్రసన్నం చేసుకోవాలో తెలియక అయోమయానికి గురౌతున్నట్లు తెలుస్తోంది. కాగా మూడు పార్టీలు మున్సిపాలిటీ ఎన్నికలను రెఫరెండంగా భావిస్తున్నట్లు తెలుస్తుంది. ఎలాగైన గెలిచి రెండు పట్టణాల్లో పట్టు సాధించాలనే కసితో అభ్యర్థుల ఎంపికను చేపడుతున్నట్లు తెలుస్తోంది. అన్ని వార్డులో ఆశావాహుల సంఖ్య అధికంగా ఉండడం, ఎవ్వరికీ వారే ధీమాగా ఉండడం ప్రస్తుతం అధినేతలకు తలనొప్పిగా మారినట్లు వినిపిస్తుంది. అసంతృప్తి వాదులను వదులుకోకుండా ఇప్పటికే బుజ్జగింపుల పర్వం మొదలు పెట్టారు. కాగా ఆమనగల్లు చైర్మన్ పదవిపై తీవ్ర పోటీ కనిపిస్తోంది. ఒక్కో పార్టీ నుండి ముగ్గురు, నలుగురు ఆశావాహులు రంగంలో ఉన్నట్లు చెబుతున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలో ఈపోటీ అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైన అభ్యర్థుల ఎంపిక తుది దశకు వచ్చే సరికి అధినేతలకు తలనొప్పులు తప్పడంలేదు.



## తూంకుంటలో టార్చ్ ర్యాలీ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జనవరి 20, ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వారి ఆదేశాల మేరకు ఛీఫ్ మినిస్టర్ కప్ కాంపిటేషన్ కార్యక్రమాన్ని మేడ్చల్ జిల్లా యువజన, క్రీడల అధికారి వై.దామోదర్‌రెడ్డి టార్చ్ ర్యాలీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంగళవారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలంలోని తూంకుంటలో ఛీఫ్ మినిస్టర్ కప్-2025 టార్చ్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. తూంకుంట బ్యాంక్ ఆఫ్ బరోడా నుంచి హకీంపేట్ తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ వరకు టార్చ్ ర్యాలీని క్రీడాకారులతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 150మంది క్రీడాకారులు, తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ సిబ్బంది కేల్ ఇండియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. జనవరి 28నుంచి 31వ తేదీ వరకు రెవెన్యూ మండల స్థాయిలో ఎంఇఓల ఆధ్వర్యంలో టార్చ్ ర్యాలీ జరుగుతుందన్నారు. ఫిబ్రవరి 3నుంచి 5వ తేదీ వరకు అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో స్పెషల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో, మిగతా 2లో

## మా పొట్ట కొట్టొద్దు మహా ప్రభో

**సిఎన్‌జి గ్యాస్ కార్మికులు ఆందోళన బాట**

**కనీస వేతనం చట్టం అమలు చేయాలని డిమాండ్**

**బిహార్ తదితర రాష్ట్రాల నుంచి కూలీలను తీసుకురావద్దని విజ్ఞప్తి**

**ఏళ్లతరబడిగా ఉన్న కార్మికులకు అన్యాయం జరుగుతోందని నిరసన**



ధర్నా చేస్తున్న కార్మికులు

**శామీర్‌పేట, జనవరి 20, ప్రభాతవార్త :** భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్-సిఎన్‌జి గ్యాస్ కార్మికులకు న్యాయం చేయాలంటూ ఆందోళన వ్యక్తం చేస్తూ ధర్నా నిర్వహించారు. మంగళవారం శామీర్‌పేట సమీపంలోని భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్-సిఎన్‌జి గ్యాస్ (సిజిడి) కార్మికులు డ్రైవర్లు, సిబ్బంది తమ విధులలో కొత్త కాంట్రాక్టు పద్దతి వల్ల కార్మికులకు ఇబ్బందులకు గురవుతున్నామని, కనీస వేతనాల చట్టం ప్రకారం న్యాయంగ గతంలో మాదిరిగా యధావిధిగా పని ఇవ్వాలని, కోతలు లేకుండా వేతనాలు డిమాండ్ చేస్తూ కార్మికులు ఆందోళన వ్యక్తం చేసి ధర్నా నిర్వహించారు. మ్యాన్ పవర్ కాంట్రాక్టు గడువు ముగియటం, జీతం తగ్గింపు, నోటీసు లేకుండ రద్దు చేయటంతో ఆందోళనకు దిగినట్లు కార్మికులు పేర్కొన్నారు. కొత్త కాంట్రాక్టును రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. మ్యాన్‌పవర్ తగ్గించటం, పని గంటలు పెంచటం, వేతనాల్లోనూ తగ్గింపులు చేయటానికి అవకాశం ఉందని భావిస్తూ వెంటనే సిఎన్‌జి గ్యాస్ కార్మికులకు అన్యాయం జరగకుండ యాజమాన్యం తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. గత 13సంవత్సరాలుగ భాగ్య నగర్ గ్యాస్ లిమిటెడ్‌లో సిఎన్‌జి గ్యాస్ సరఫరా ప్లాంట్‌లో పనిచేస్తున్న కార్మికులపై వేటు వేయటం సరికాదని అన్నారు. ఈ సం దర్భంగ శామీర్‌పేట గ్రామ మాజీ ఎంపిటిసి డప్పు సాయిబాబు, బిజెపి నాయకులు ఎన్. రవీందర్‌గౌడ్‌లు మాట్లాడుతూ కార్మికులకు మద్దతు తెలుపుతూ ఏళ్ల తరబడిగా పనిచేస్తున్న కార్మికులకు అన్యాయం మిగతా 3లో

## సవాళ్లను ఎదుర్కొనే సత్తా పెంచుకోండి

**పోలీసు సిబ్బందికి ఎస్‌పి స్నేహ మెహ్రా హితవు**

**ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన**



పోలీసుల వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి

**కొడంగల్, జనవరి 20 ప్రభాతవార్త :** ఆరోగ్యమే మహాభా గ్యమని, పోలీసు సిబ్బంది సంక్షేమమే మా ప్రాధ్యానత, పోలీసు శాఖలో పనిచేసే ప్రతి ఉద్యోగి ఆరోగ్యం శాఖకు వారి కుటుంబానికి ఎంతో విలువైనదని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా అన్నారు. ముందుగా శిబిరాన్ని సందర్శించి, వైద్య పరీక్షలు చేయించుకుంటున్న సిబ్బందితో ఎస్పీ మాట్లాడారు. కేవలం జిల్లా కేంద్రానికే పరిమితం కాంకుడా అన్నీ పోలీస్‌స్టేషన్‌లలో విధులు నిర్వహించే సిబ్బందికి కూడా అత్యుత్తమ వైద్య సేవలు అందించాలనే సదుద్దేశ్యంతో జిల్లా పోలీస్ యంత్రాంగం, జిల్లా పోలీస్ అసోసియోషన్ అధ్వర్యంలో మంగళవారం పరిగి సబ్ డివిజన్, తాండూర్ సబ్ డివిజన్ పోలీసు అధికారులకు, హోంగార్డ్స్ అధికారులకు కొడంగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాఘవేంద్ర ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరానికి ఎస్పీ ముఖ్య అతిధిగా హాజరై ప్రారంబించారు. ముందుగా ఎస్పీ మిగతా 2లో



ఉద్యానవన పంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

## రైతులకు సబ్సిడీపై నర్సరీలు

**మార్కెటింగ్‌కూ మౌలిక సదుపాయాలు**

**కలెక్టర్ ప్రతీక్ జైన్**

**వికారాబాద్, జనవరి 20, ప్రభాతవార్త :** ఉద్యానవన పంటల సాగుపై పూర్తిగా అవగాహన పెంచుకొని అధిక దిగబడులతో ఆర్థిక లాభాలతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ రైతులకు సూచించారు. మంగళవారం వికారాబాద్ మండలం ఎర్రవల్లి, మదనపల్లి గ్రామాల్లో పర్యటించి ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులతో ఉద్యానవన శాఖ అధికారులు, వివిధ బ్యాంకర్లతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, ఉద్యానవన పంటలు నాణ్యతతో పండించి నట్లయితే అధిక లాభాల ం గడించవచ్చన్నారు. ఉద్యానవన పంటలకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని, అలాంటి వివరాల ం సంబంధిత శాఖల అధికారుల ం సంప్ర దించి సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రైతులకు సూచించారు. ఉద్యానవన పంటలు పండిస్తున్న రైతుల సమస్యలు తెలుసుకోవడానికి, రైతుల సూచనలు పరిగణలోకి తీసుకొని రైతులకు కావలసిన అవసరాలు తెలుసుకునేందుకు అధికారులతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షి స్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పూలు, కూరగాయలు, పండ్ల తోటల సాగుతో పాటు ఆయిల్ ఫామ్ పంటలు వేసుకునేందుకు ముందుకు రావాలని కలెక్టర్ తెలిపారు. రైతుల మిగతా 2లో

## మున్సిపోల్‌కు కసరత్తు

**నేడు కోమటిరెడ్డి రాక కాంగ్రెస్ నాయకులతో సమీక్ష**

**శామీర్‌పేట, జనవరి 20, ప్రభాతవార్త :** మల్కాజ్‌గిరి పార్లమెంట్ మున్సిపల్ ఎన్నికల ఇంచార్జి, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బుధవారం ఉదయం అలియాబాద్ చౌరస్తా శుభం గార్డెన్‌లో జరిగే మూడు మున్సిపాల్టీల కాంగ్రెస్ నాయకుల సమావేశానికి విచ్చేస్తున్నట్లు మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మేడ్చల్ జిల్లాలోని మూడు మున్సిపాల్టీల కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఎన్నికలపై దిశానిర్దేశం చేస్తారని అన్నారు. 21న బుధవారం ఉదయం 10.30గంటలకు శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ చౌరస్తా శుభం గార్డెన్‌లో మూడు మున్సిపాల్టీల కాంగ్రెస్ నాయకుల సమావేశం డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ అధ్యక్షతన జరుగుతుంది. మేడ్చల్ నియోజకవర్గంలో అలియాబాద్, మూడుచింతలపల్లి, ఎల్లంపేట్ మున్సిపాల్టీలు ఉన్నందున మేడ్చల్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, అన్ని కమిటీల అనుబంధ కమిటీలు పాల్గొనాలని వజ్రేశ్‌యాదవ్ కోరారు.

## గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి

**కుల్కచర్ల,జనవరి 20, ప్రభాతవార్త:** గ్రామ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని సర్పంచ్ శ్రీనివాస్ నాయక్ అన్నారు. మంగళ వారం మండల పరిధిలోని లాల్‌సింగ్ తాండ గ్రామ పంచాయతీలో వీధి దీపాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ..ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శారద తదితరులు పాల్గొన్నారు.



వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్న సర్పంచ్ శ్రీనివాస్ నాయక్

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత



సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న నేతలు

**కుల్కచర్ల,జనవరి 20, ప్రభాతవార్త:** సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని ఎఎంసి ఛైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామానికి చెందిన వడ్ల రమేష్, తాళం రాజు అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన వారికి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందని అన్నారు.ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ప్రభుత్వం విద్యా, వైద్యంకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కృష్ణయ్య,బోల్ల భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.

## గట్టుఇప్పలపల్లిని మండలం చేస్తూ కల్వకుర్తిని జిల్లా కేంద్రంగా ప్రకటించాలి



**కల్వకుర్తి ,జనవరి 20, ప్రభాతవార్త:** ..కల్వకుర్తి నియోజకవర్గంలో ని గట్టుఇప్పల పల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తూ కల్వకుర్తి నియోజకవర్గాన్ని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని గట్టుఇప్పలపల్లి గ్రామ బి ఆర్ ఎస్ నాయకులు డిమాండ్ చేయడం జరిగింది. గట్టుఇప్పల పల్లి గ్రామంలో గ్రామ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బి ఆర్ ఎస్ నాయకులు మాట్లాడుతూ గట్టుఇప్పల పల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని గతంలో 2 3 దఫాలుగా రిలే నిరాహార దీక్షలు, వివిధ రకాల నిరసన దీక్షలు, కల్వకుర్తి క్యాంప్ కార్యాలయం ముట్టడి చేసి, పాద యాత్ర ద్వారా స్థానిక , కలెక్టర్ అప్పటి సంబంధిత జిల్లా మంత్రులు, ఇన్ చార్జ్ మంత్రులు ముఖ్యమంత్రి వరకు కూడా వెళ్లి విన్నవించినా మాకు మండల కేంద్రము రాలేదని, గత ఎన్నికల్లో ఆమన్‌గల్‌లో బి ఆర్ ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మరియు కల్వకుర్తిలో జరిగిన సభలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా అధికారంలోకి వస్తే మండలం ప్రకటిస్తామని తెలియజేసిన ఆ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించారని అప్పటి బి ఆర్ ఎస్ కసిరెడ్డి నారాయణ్ రెడ్డి కాంగ్రెస్ తరపునగా గెలిచారని , ఆయన గతంలో గట్టుఇప్పల పల్లి మండల కేంద్రముగా ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని కానీ , గెలిచిన తర్వాత హామీని విస్మరించారని వారు అన్నారు. ఈ ప్రాంత వాసి అయిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి గా అయినందున ఇప్పటికైనా గట్టుఇప్పల పల్లి ని మండల కేంద్రంగా ప్రకటిస్తూ, రేవంత్ రెడ్డి గారి సొంత ప్రాంతమైన కల్వకుర్తి ని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని లేని పక్షంలో బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మళ్లీ నిరసన దీక్షలు, ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలియజేసారు.
ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ జయమ్మ వెంకటయ్య,బి ఆర్ ఎస్ గ్రామ అధ్యక్షుడు ఏదుల రాజు,ఉపాధ్యక్షుడు కానుగుల జంగయ్య, నాయకులు మండల కృష్ణయ్య, శరత్ చంద్ర శర్మ, ఆంజనేయులు గౌడ్, బోల్లి కృష్ణ, కొండల్ వాల్మీకి, ఇట్యాల రవీందర్, జోలం లింగం, ఈదమయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలకు రండి ఎమ్మెల్యేకు వినతి




ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న నాయకులు

**తలకొండపల్లి, జనవరి20,ప్రభాత వార్త:** తలకొండపల్లి మండల కేంద్రములో ఈనెల 23,24,25, తేదీలలో జరిగే బ్రహ్మోత్సవాలకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి రావాలని కోరుతూ మంగళవారం ఆహ్వానపత్రం అందించారు. తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ ఠాకూర్ బాలాజీ సింగ్,ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీత నరసింహ , గుడి కమిటీ సభ్యులు తుమ్మ నరసింహ,పురుషోత్తం,బండి పాండు,బ్యాగరి రాములు,తుమ్మ కృష్ణయ్య,తుమ్మ నరసింహ,నాగరాజు,వారికి ఆహ్వాన పత్రిక ఇచ్చి ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నరసింహారెడ్డి,మల్లేష,పవన్ వాల్మీకి,తదితరులు పాల్గొన్నారు.

## సిఎం కప్ మండల స్థాయి కమిటి సమావేశం

**యాచారం,జనవరి20, ప్రభాతవార్త :** యాచారం మండలలో సిఎం కప్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు తహసిల్దార్, ఎంపిడిఒ , సిఐ, ఎంపిఒ

మండల స్థాయి కమిటీ సమావేశం మంగళవారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష ఏర్పాటు చేశారు. తాసిల్దార్ అయ్యప్ప, ఎంపిడిఒ రాధా రాణి, సిఐ నందీశ్వర్ రెడ్డి, ఎంపీ ఓ శ్రీలత, ఆర్డబ్ల్యూఎస్ ఎఇ శభాష్, గ్రామ కార్యదర్శుల తో కలసి వివిధ అంశాల పై చర్చ జరిపారు.సిఎం కప్ క్రీడల పోటీలు నిర్వహించనున్నారు. అందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# తాగునీటి సరఫరాను పెంచండి

### నగర మెట్రో వాటర్ వర్క్స్ ఎండికి వినతి

**ఘట్‌కేసర్ రూరల్, జనవరి 20, ప్రభాత వార్త:** పోచారం డివిజన్ 8 పరిధిలో వేసవికాలం దృష్ట్యా నీటి సరఫరాను పెంచాలని కోరుతూ మాజీ మున్సిపల్ చైర్మన్ బి. కొండల్ రెడ్డి ఖైరతాబాద్‌లోని హెచ్‌ఎండబ్ల్యూఎస్ కార్యాలయంలో ఎండి అశోక్‌రెడ్డికి మంగళవారం వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. పోచారం డివిజన్ పరిధిలో నీటి బిల్లులను తగ్గించాలని కోరినట్లు తెలిపారు. డివిజన్‌పరిధిలో బోరుబావి నీళ్లు, కృష్ణనీళ్ల కలిపి సరఫరా చేస్తున్నందున బడుగు బలహీన వర్గాల ప్రజలు నివసిస్తున్నందున నీటి బిల్లులు తగ్గించాలని కోరినట్లు తెలిపారు. యంనంపేట్, ఇస్మాయిల్ ఖాన్‌గూడ గ్రామాలకు నీటి సరఫరా చేయాలని హెచ్‌ఎండబ్ల్యూఎస్ మేనేజింగ్ డైరక్టర్ అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేసినట్లు మాజీ చైర్మన్ తెలిపారు.



పోచారం డివిజన్ పరిధిలో తాగునీటి సరఫరాను పెంచాలని కోరుతూ హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఎండీ అశోక్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ కొండల్ రెడ్డి.

# సైబర్ నేరాలపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న సర్పంచ్ సంగెం చైతన్యరాజు

**యాచారం,జనవరి20, ప్రభాతవార్త:** ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం నానక్‌నగర్ గ్రామంలో సైబర్ నేరాలు,బ్యాంక్ సదుపాయాలపైన ప్రత్యేకమైన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. దీనికి ముఖ్యఅతిథులుగా గ్రీన్ ఫార్మా సిటీ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ ,ఇండియన్ బ్యాంక్ మేనేజర్,ఎస్సై వంశి, గ్రామ సర్పంచ్ సంగెం చైతన్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సర్పంచ్ చైతన్య మాట్లాడుతూ..బ్యాంకు సేవలను అందరూ వినియోగించుకొని కెవైసి తప్పకుండ చేయించుకోవాలని, సైబర్ నేరాల బారిన ఎవ్వరూ పడకూడదన్నారు. సమాజంలో ఆర్థిక నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి అన్నారు. ఆన్లైన్ గేమ్ నుండి యువత దూరంగా ఉండాలన్నారు. ముఖ్యంగా యువత ఆన్లైన్ గేమ్ ద్వారా నష్టపోతున్నారని తల్లిదండ్రులు వారిని అప్పుడప్పుడు పర్యవేక్షిస్తూ నిఘా పెంచాలని క్రమశిక్షణ పెంచాలని అన్నారు.ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా చూసుకోవాలని కోరారు. గతంలో ఎంతోమంది కానిస్టేబుల్ ఉద్యోగస్తులే ఆన్లైన్ గేమ్ ద్వారా మోసపోయి ఆత్మహత్య చేసుకున్న సంఘటన విషయాలను గుర్తు చేశారు. అనంతరం సిఐ సత్యనారాయణ మాట్లాడుతూ.. సైబర్ నేరాల గురించి డిజిటల్ అరెస్టు ఆన్లైన్ మోసాల గురించి పూర్తిగా వివరించారు.ఏదైనా సమాచారం కోసం 1930కి లేదా 100కి కాల్‌చేయాలనీ సూచించారు. ఇండియన్ బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ.. 18నుండి70 సంవత్సరాలు ఉన్నవారు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన 20 రూపాయలు కట్టుకుంటే ప్రమాదవసత్తు ఆక్సిడెంట్ అయి చనిపోయిన వ్యక్తి యొక్క నామినికి 2లక్షలు బీమా భరోసా బ్యాంకు నుండి ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే 18నుండి 50 సంవత్సరాలు ఉన్నవారు ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా 436రూపాయలు కట్టుకుంటే జబ్బు బారిన పడి చనిపోయిన 2లక్షల రూపాయలు నామినికి రావడం జరుగుతుంది అని తెలిపారు.బిసి సంఘం ఇబ్రహీంపట్నం అధ్యక్షులు సంగెం రాజు మాట్లాడుతూ.. గ్రామంలో ప్రజలు ప్రతి ఒక్కరూ బీమా లు కట్టుకుంటే వారి కుటుంబానికి భరోసా గా ఉంటుంది పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వంశీ, వార్డు సభ్యులు, మహిళా సంఘ నాయకులు, కౌన్సిలర్ వై వెంకటేష్,బర్ల మల్లేష్ యాదవ్ ఎస్ కె రఫియా,గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొనడం జరిగింది .

# బొద్దునపల్లి గ్రామంలో విద్యుత్ కాంతులు

**కేశంపేట, జనవరి 20, ప్రభాతవార్త :** గత కొంతకాలంగా గ్రామంలో విద్యుత్ దీపాలు వెలగక గ్రామస్తులు, వృద్ధులు అనేక ఇబ్బందులకు గురయ్యారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉండేది. కేశంపేట మండల పరిధిలోని బొద్దునపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ తీర్మానం ద్వారా అన్ని వీధులలో కలుపుకొని 70 వీధిదీపాలను ఏర్పాటుచేసి గ్రామంలో విద్యుత్ కాంతులను ఏర్పాటు చేసిన సర్పంచ్ ఎదురె నాగేశ్వర్‌ను గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయి ప్రసాద్ రెడ్డి మాజీ సర్పంచ్ వెంకటయ్య వార్డు సభ్యులు ఎదురే బీరప్ప పిప్పళ్ళ నరేందర్ కిష్టయ్య గ్రామ పెద్దలు ఎగిరే మల్లయ్య గిరి డీలర్ వెంకటయ్య యాదగిరి నెహ్రూ సత్తయ్య కృష్ణయ్య బాలరాజ్ ఆంజనేయులు యాదయ్య రోశయ్య తిరుపతయ్య మురళి శ్రీకాంత్ శ్రీను రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



బొద్దునపల్లి గ్రామంలో వీధి దీపాలు వేయిస్తున్న సర్పంచ్ నాగేశ్వర్ ,తదితరులు

# పోచారంలో వీధి దీపాలు ఏర్పాటు చేయండి

### డిసికి యూత్ కాంగ్రెస్ నేత వినతి

**ఘట్‌కేసర్ రూరల్, జనవరి 20, ప్రభాత వార్త:** పోచారం డివిజన్ 8 పరిధిలోని పలు గ్రామాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతూ ఘట్‌కేసర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కె. వినోద్‌కుమార్ జిహెచ్‌ఎంసీ ఘట్‌కేసర్ డిప్యూటీ కమిషనర్ వాణికి మంగళవారం వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఘట్‌కేసర్ సర్కిల్ కార్యాలయంలో డీప్యూటీ కమిషనర్‌ను కలిసి పోచారం డివిజన్ పరిధిలోని గ్రామాలు వెంకటాపూర్, ప్రతాప సింగారం, చౌదరిగూడ, కొర్రెముల, కాచవాని సింగారం తదితర గ్రామాల్లో వీధీ దీపాలు లేకపోవడంతో రాత్రి వేళ , పాదచారులు, వృద్ధులు, మహిళలు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని వినతి పత్రం అంద జేసినట్లు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కె. వినోద్ తెలిపారు.



వినోద్ డిసి వాణిని కలిసి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం.

## కొందుర్గు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన షాద్నగర్ డిసిపి శిరీష

**కొందుర్గు, జనవరి 20, ప్రభాతవార్త:** సైబర్ నేరాలు, డ్రంక్ అండ్ డ్రైవ్, అతివేగం ప్రయాణం తో జరుగుతున్న ప్రమాదాలు తదితర అంశాలు పట్ల ప్రజలను అప్రమత్తం చేసి , అవగాహన కల్పించాలని షాద్నగర్ డిసిపి శిరీష సిబ్బందికి సూచించారు. మంగళవారం నాడు ఆమె కొందుర్గు పోలీస్ స్టేషన్ ను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు.

మంగళవారం కొందరు పోలీస్ స్టేషన్ కు వచ్చిన ఆమె ముందుగా పోలీస్ స్టేషన్ కేసు లకు సంబంధించిన అన్ని రికార్డులను, పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం స్టేషన్ గదులను, పరిసరాలను చూసి పరిశుభ్రంగా ఉండటంతో సిబ్బంది నీ అభినందించారు. మండలంలో శాంతి భద్రతల గురించి స్థానిక సబ్ ఇన్స్పెక్టరు రవీంద్ర నాయక్ ను అడిగి తెలుసుకోవాల ని, అలాగే సిబ్బంది పనితీరును ఆమె అభినందించారు.



కొందుర్గు పోలీస్‌స్టేషన్లో తనిఖీ చేస్తున్న డిసిపి శిరీష.

# బహుళ విపత్తులు ఆధారంగా మాక్ డ్రిల్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జనవరి 20, ప్రభాతవార్త:** బహుళ ప్రమాదాల విపత్తులపై మాక్ ఎక్సర్సైజ్ నిర్వహణకు పక్కాగా ఏర్పాటు చేయాలని ఎన్. డి. ఎం ఎ అధికారులు పిలుపునిచ్చారు. బహుళ ప్రమాదాల విపత్తు నిర్వహణ సంబంధిత మాక్ డ్రిల్ ఈ నెల 21న జిల్లాలో ప్రయోగాత్మకంగా నిర్వహించే మా క్ ఎక్సర్సైజ్ సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై మంగళవారం నాడు సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.బహుళ విపత్తులు దృశ్యం ఆధారంగా మాక్ డ్రిల్ సంభవించిన వెంటనే చేపట్టవలసిన తక్షణ చర్యలు సమన్వయం, సమాచార వ్యవస్థ, అత్యవసర సేవల నిర్వాణ వంటి అంశాలపై అధికారులకు మార్గ నిర్దేశం చేశారు. మాక్ డ్రిల్ నిర్వహణకు నిర్ణీత ప్రణాళిక ఆయా శాఖల బాధ్యతలు విమానాయానేతర రంగంలో విపత్తు నిర్వహణకు సంబంధించిన మాకు డ్రిల్లు ఈ నెల 21 బుధవారం నాడు శంషాబాద్ లోని ఎయిర్పోర్ట్ ఆవరణలో నిర్వహించనున్నట్లు తెలిపారు. బహుళ ప్రమాదాల విపత్తులు, వరదలు, ఊహించని రీతిలో ప్రమాదాలు జరిగిన సమయంలో ఎలా స్పందించాలి, ఆస్తి ప్రాణ నష్టం నివారించేందుకు ఏ విధమైన చర్యలు తీసుకోవాలి వివిధ శాఖల మధ్య సమన్వయం ఎలా ఉండాలి అనే అంశాలపై ఈ మాక్ ఎక్సర్సైజ్ ద్వారా ప్రయోగాత్మకంగా అవగాహన కలుగుతుందని విపత్తులను ఎదుర్కొనే విషయంలో సన్నందత ఏ మేరకు కలిగి ఉన్నామనేది అవగతం అవుతుందని వారు పేర్కొన్నారు మాకు ఎక్సర్సైజ్‌ను పకడ్బందీగా విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అన్ని శాఖలు అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాటులో సంసిద్ధంగా ఉండాలని ఎన్డిఎంఏ అధికారులు సూచించారు ఇది కేవలం మాకు ఎక్ససైజ్ మాత్రమే అని దీని ద్వారా ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురికా వద్దని విపత్తులు సంభవించినప్పుడు ప్రజలు భయపడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని ఉద్దేశంతో ఈ మాకు ఎక్సర్సైజ్ చేపట్టడం జరుగుతుందని తెలిపారు ఎలాంటి వదంతులు ప్రచారం చేయొద్దని ఎన్డీఎంఏ అధికారులు కోరారు

# శిశుమందిర్ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసాలు

**పరిగి, జనవరి 20,ప్రభాతవార్త:** పరిగి పట్టణ కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ ఇంగ్లీష్ మీడియం ఆధ్వర్యంలో జనవరి 23వ తేదీన వసంత పంచమి సందర్భంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించనున్నట్లు పాఠశాల యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. సరస్వతీదేవి పుట్టినరోజు సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించడం ఎంతో శుభప్రదమని, దీనివల్ల పిల్లల విద్యాభివృద్ధికి మంచి ఫలితాలు ఉంటాయని వారు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమానికి అధ్యక్షులు రాచూరి శ్రీనివాస్ రెడ్డి , ముఖ్య అతిథి సినీ నటుడు విజయభాస్కర్ , అతిథి ఎస్టిపి శ్రీధర్ చీఫ్ మేనేజర్ ఎస్ బి ఐ పరిగి, వక్త డాక్టర్ పి భాస్కర్ యోగి జాతీయ సాహిత్య పరిషత్ ప్రచార కార్యదర్శి వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమం గత 54 సంవత్సరాలుగా నిరంతరంగా కొనసాగుతుండటం విశేషమని తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే చిన్నారులు మరియు తల్లిదండ్రులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పాఠశాల యాజమాన్యం చేస్తుందని, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అక్షరాభ్యాస కార్యక్రమానికి సంబంధించి ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పాఠశాల ప్రధాన చార్యులు కె మల్లేష్ సూచించారు.




పైపులైన్ లీకేజీ మరమ్మత్తు పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ బి. కొండల్ రెడ్డి.

## పోచారంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా మాజీ మున్సిపల్ చైర్మన్

**ఘట్‌కేసర్ రూరల్, జనవరి 20, ప్రభాత వార్త:** పోచారం డివిజన్ 8 పరిధిలోని అన్నోజిగూడ, శ్రీ లక్ష్మీనర్సింహ కాలనీ తదితర చోట్ల దాదాపు రూ.20 వేలు స్వంత డబ్బులతో తాగునీటి సమస్య పరిష్కారానికి పైపులైన్ల మరమ్మత్తు పనులు చేయించినట్లు మున్సిపల్ మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడి మంగళవారం తెలిపారు. తాగునీటిని సరఫరా చేసే పైపులైన్లకు పలుచోట్ల లీకేజీలు ఏర్పడ్డాయి. దీంతో పైపులైన్ల జాయింట్లను ఏర్పాటు చేయకపోవడంతో అన్నోజిగూడ, లక్ష్మీనర్సింహ కాలనీ, మార్కెట్ రోడ్డు కాలనీలో తీవ్ర నీటి ఇబ్బంది ఏర్పడగా స్థానికులు సమస్యను మాజీ మున్సిపల్ చైర్మన్ కొండల్ రెడ్డి దృష్టికి తీసుకురాగా దాదాపు ఇరవైవేల నిధులతో పైపులైన్లకు పలుచోట్ల జాయింట్లు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. దాదాపు పది చోట్ల పైపులైన్లకు మరమ్మత్తు పనులు చేపట్టినట్లు తెలిపారు. డివిజన్ పరిధిలో సమస్యలుంటే వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని మాజీ చైర్మన్ తెలిపారు.

## ఆంజనేయస్వామి దేవాలయానికి 10 కుర్చీల బహుకరణ

**తలకొండపల్లి, జనవరి 20 ,ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జల్ గ్రామంలో గల ఆంజనేయస్వామి దేవాలయంలో భక్తుల సౌకర్యం మేరకు పది కుర్చీలను గ్రామ ఉపసర్పంచ్ విజయ లక్ష్మి విజయకుమార్లు మంగళవారం బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయ భక్తుల సౌకర్యార్థం స్వచ్ఛందంగా తాము కుర్చీలు అందజేసినట్లు ఈసందర్భంగా వారు తెలిపారు. అనంతరం దేవాలయ కమిటీ సభ్యులు వారిని అభినందించారు. గోపాలకృష్ణ ,మోహన్, భాస్కర్ ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

దేవాలయంలో భక్తులకు కుర్చీలు అందజేస్తున్న గ్రామ ఉప సర్పంచ్ విజయలక్ష్మి విజయకుమార్లు





అనాథ పిల్లలకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఐటీ కారిడార్ హాస్టల్ అసోసియేషన్ అధ్యక్షుడు అమర్‌నాథ్ రెడ్డి తదితరులు.

# సమాజ సేవే నా లక్ష్యం

### సంస్కృతి టౌన్‌షిప్‌లో అనాథ పిల్లలకు నోటు పుస్తకాలు పంపిణీ

**ఘట్‌కేసర్ రూరల్, జనవరి 20, ప్రభాత వార్త:** అనాథ పిల్లల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పోచారం ఐటి కారిడార్ హాస్టల్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. అమర్‌నాథ్ రెడ్డి అన్నారు. పోచారం ఐటీ కారిడార్ పరిధిలోని హాస్టల్ అసోసియేషన్ అధ్యక్షుడు నెక్స్ట్‌జెన్ గ్రూప్ ఆఫ్ హాస్టల్స్ వ్యవస్థాపకుడు అమర్‌నాథ్ రెడ్డి సేవా కార్యక్రమంలో భాగంగా టౌన్‌షిప్‌లోని ఆగపే అనాథ ఆశ్రమంలో చిన్నారులకు మంగళవారం నోటు పుస్తకాలు, పెన్నులు, కంపాక్స్ బాక్సులు తదితర విద్యాసామాగ్రితో పాటు వివిధ ఆటవస్తువులను అందజేశారు. చిన్నారుల విద్యా సాంస్కృతిక అభివృద్ధికి తన వంతు సహకారం అందించడం సంతోషంగా ఉందని అన్నారు. సమాజ సేవే తన లక్ష్యమని భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## నంది వనపర్తి,మంతన్ గౌరెల్లిలో విద్యుత్ అంతరాయం

**యాచారం,జనవరి20 ప్రభాతవార్త:** యాచారం మండల పరిధిలోని మంతన్ గౌరెల్లి, నంది వనపర్తి గ్రామాలలో బుధవారం అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ సుధీర్ తెలిపారు. ఏఇ ప్రకటన తెలుపుతూ.. విద్యుత్ మరమ్మతుల కారణంగా రెండు గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. గ్రామంలోని చిరు వ్యాపారులు, పాడి పరిశ్రమ, పౌల్ట్రీ పరిశ్రమలవారు,ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

## గురుకుల పాఠశాలలో ప్రవేశం కోసం విద్యార్థులకు ఆహ్వానం

### ఆమనగల్ ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ వినోల

**షాబాద్ జనవరి 20, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సాంఘిక, గిరిజన, వెనుక బడిన సంక్షేమ శాఖల సాధారణ గురుకుల విద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను 5 నుండి 9 వ తరగతి ప్రవేశ పరీక్షకు ఆసక్తి కలిగి ఉన్న విద్యార్థులు ఈ నెల 21 వ తేదీ వరకు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆమనగల్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ వినోల మంగళవారం తెలిపారు. షాబాద్ మండల కేంద్రంలోని పిఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో ఆమనగల్ ఎస్సీ గురుకుల పాఠశాలను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని ఆసక్తి కలిగిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ప్రభుత్వం నిర్దేశించిన మెనూను కచ్చితంగా పాటించండి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న దళపతి గౌడ్

**మాడ్గుల, జనవరి 19,ప్రభాతవార్త:** ఇర్విన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇర్విన్‌లో ఉపసర్పంచ్ గాదెమోని దళపతి గౌడ్ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి శ్రీశైలం, సీనియర్ నాయకులు బొడ్డు శంకర్, గ్రామ యువనాయకులతో కలిసి పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో కలిసి కూర్చొని భోజనం చేసిన ఉపసర్పంచ్, మెనూ వివరాలు, వంటల నాణ్యత, వారానికి ఎన్ని రోజులు గుడ్లు అందిస్తున్నారనే అంశాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను కచ్చితంగా పాటిస్తూ, విద్యార్థులకు రుచికరమైన మరియు నాణ్యమైన భోజనం అందించాలని మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో యువనాయకులు సయ్యద్ సలీం, మామిడి శివ, మాడ్గుల కిరణ్, బాతుక రమేష్, బొలెమోని శ్రీకాంత్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉచిత పశు గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం

### సంగెం గ్రామ సర్పంచ్ వేణుగోపాలాచారి

**కేశంపేట, జనవరి 20, ప్రభాతవార్త :** పాడి రైతులు పశువుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పశువులకు సరైన సమయంలో వైద్యచికిత్సలు అందించి పశు గణాబివృద్ధి పొందాలని సంగెం గ్రామ సర్పంచ్ వేణుగోపాల్ చారి పిలుపు ఇచ్చారు. మంగళవారం కేశంపేట మండలం సంగెం గ్రామంలో పశు గణాభివృద్ధి సంస్థ, పశు వైద్య, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు గర్భకోశ వ్యాధి చికిత్సా శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎదకు వచ్చిన పాడి పశువులకు కృత్రిమ గర్భధారణ, ఎదకు రాని పశువులకు చికిత్స చేయడం, గర్భకోశ వ్యాధులకు చికిత్స చేయడం, లేగదూడలకు నట్టల నివారణ మందులు అందించడం జరిగింది. గ్రామంలో మొత్తం 84 లేగదూడలకు నటల నివారణ మందులు, 74 పశువులకు గర్భకోశ వ్యాధులు, 17 పశువులకు సాధారణ చికిత్సలు చేయడం జరిగింది. అనంతరం డాక్టర్ సబితా మాట్లాడుతూ పశు వైద్య శిబిరాన్ని గ్రామ రైతులు అందరూ వినియోగించుకోవాలనీ కోరారు. ఇక ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచు షకీల్, రాజీవ్ పైలెట్ జె వి ఓ, సామయ్యా, స్వప్న ఆల్ స్ ఏ లు, గోపాల మిత్ర సూపర్ వైజర్ వెంకటేష్, గోపాల మిత్రులు సంతోష్, రమేష్, రాజు, మహేష్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.



పశువులకు చికిత్స అందిస్తున్న పశువైద్యులు